Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 141 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 10 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## థాయ్‌లాండ్‌లో కనిపించిన గౌరవ్ లూథ్రా



**పనజి:** గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే దేశం విడిచి పరారైన క్లబ్ యజమానుల్లో ఒకరైన గౌరవ్ లూథ్రా ఆచూకీ తెలిసింది. థాయ్‌లాండ్‌లోని పుకెట్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ చెక్ సమయంలో ఆయన కనిపించారు. ఆ తర్వాత సోదరులిద్దరూ పుకెట్ రిసార్ట్‌కు చేరుకున్నారని, అయితే అధికారులు అక్కడకు చేరుకునేలోపే ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టారని తెలుస్తోంది. నైట్‌క్లబ్ ప్రమాదంలో 25 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది గంటలకే లూథ్రా సోదరులు దేశం విడిచి పారిపోయారు. గత ఆదివారం తెల్లవారు జామున 5.30 గంటలకు గౌరవ్ (44) అతని సోదరుడు సౌరభ్ (40) పుకెట్ వెళ్లే ఇండిగో విమానంలో ప్రయాణించినట్టు పోలీసులు చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ ఇద్దరూ ఢిల్లీలోనే ఉన్నారు. మరోవైపు, గౌరవ్ లూథ్రా, సౌరబ్ లూథ్రాలపై ఇంటర్‌పోల్ తాజాగా బ్లూకార్నర్ నోటీసులు జారీ చేసింది. పరారీలో ఉన్న సోదరుల జాడను తెలుసుకునేందుకు గోవా పోలీసులు ఇంటర్‌పోల్ సాయం కోరడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. కాగా, గోవా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టి 25 మంది ప్రాణాలను బలిగొన్న రోమియో లేన్ నైట్‌క్లబ్ కూల్చివేతకు ఆదేశాలిచ్చింది. అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేసి తక్షణం నైట్‌క్లబ్‌ను కూల్చేయాలని జిల్లా యంత్రాంగానికి ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆదేశాలిచ్చారు. కూల్చివేత ఆపరేషన్‌కు యంత్రాంగం, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## భూ వివాదరహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

### - రెవెన్యూ సమస్యలన్నీ ఏడాదిలోగా జాయింట్ కలెక్టర్లు పరిష్కరించాలి - 2027 జనవరి నాటికి రీసర్వే 2.0 పూర్తి - ఇక నుండి ఆలస్యం లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ - పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్ : రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఎటువంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రపదేశ్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ పై సమీక్షా సమావేశం జరిగిందని, ఈ సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. కృత్రిమ మేథ సహకారంతో రెవెన్యూ శాఖలో జీరో ఎర్రర్ ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. గతంలో 7,600 గ్రామాల్లో చేసిన రీ సర్వేలో జరిగిన తప్పులను ఈ ఏడాదిన్నర కాలంలో సరిదిద్దామన్నారు. రీ సర్వే 2.0 ను 2027 జనవరి నాటికికల్లా పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే ప్రహసనంలా మార్చారని, ఆ సమస్యలన్నీ పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్ ప్రారంభించామని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 1.74 లక్షల ఆటో మ్యూటేషన్లు నమోదు అయినట్లు తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో ఆటో మ్యూటేషన్ జరిగి ఆయా డాక్యూమెంట్స్ రిజిస్ట్రర్ పోస్ట్‌లో సదరు భూ యజమానికి చేరే విధంగా కార్యాచరణ రూపకల్పన చేశామన్నారు. కొత్త పాస్ పుస్తకాల జారీలో టెండర్ నిబంధనల కారణంగా ఆలస్యమౌతోందని, ఇక నుండి త్వరగా పాస్ పుస్తకాలు జారీ చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఖాళీగా ఉన్న జేసీ పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయనున్నామన్నారు. రెవెన్యూ సమస్యలను ఏడాది కాలవ్యవధిలోగా పూర్తిగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్లపై బాధ్యత పెడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది కాలం పాటు వీరు రెవెన్యూ సమస్యల పరిష్కారంపైనే పని చేస్తారని చెప్పారు. 22ఏ జాబితాను క్లారిఫై చేసి ప్రభుత్వం, కోర్టులు జరిపిన వేలంలో కొనుకున్న భూములను ఆ జాబితా నుండి తొలగిస్తామని చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల రాష్ట్రంలో 36 లక్షల ఎకరాలు ఉండాలని, అయితే నేడు లెక్కలోకి వస్తుంది కేవలం 11లక్షల ఎకరాలు మాత్రమే అని అన్నారు. రెండు నెలల్లో ఫ్రీహోల్డ్ భూముల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి అనగాని అన్నారు. కుల ధృవీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నామన్నారు. 2.77 కోట్ల కులధృవీకరణ పత్రాలు ఇప్పటి వరకు జారీ చేయడం జరిగిందన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 86 శాతం పరిష్కరించామని, మిగిలిన 14 శాతం త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈనాం భూముల పరిష్కారానికి రెవెన్యూ, ఎండోమెంట్ శాఖలు సమన్వయంతో పనిచేసి 45 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖలో ప్రతి సమస్యను పరిష్కరించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఇక రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లో అమలు చేయబడుతున్న రిజిస్ట్రేషన్ విదానాలను అద్యయనం చేసి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయనున్నామని తెలిపారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వలే రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పాటు పై సమాలోచన చేస్తున్నామన్నారు. భూ యజమానులందరూ జాయింట్ ఎల్పీఎమ్‌లను వెంటనే సబ్ డివిజన్ చేయించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 2 లక్షల జాయింట్ ఎల్పీఎమ్ఎస్‌లు ఉన్నాయని, వారిలో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తిరుచానూరు ఆలయ పోటు కార్మికులు మృతి

**తిరుపతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయి.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలిపిస్తున్న పరిస్థితి. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ కూడా అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటిని ప్రమదాలకు కార ణాలుగా నిలుస్తున్నాయి. తాజాగా తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు తిరుచానూరు అమ్మవారి ఆలయ పోటు వర్కర్లుగా గుర్తించారు. కార్మికులు ఇద్దరు తిరుపతి నుంచి తిరుత్తనికి కారులో వెళుతున్నారు. ఈ క్రమంలో నగరి మండలం తడుకు పేట వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మరో కారు డ్రైవర్ కూడా సంఘటనా స్థలంలోనే చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోటు కార్మికుల మృతి.. తిరుచానూరులో ఉన్న మిగిలిన పోటు కార్మికుల్లో విషాదాన్ని నింపింది.

## 2047 నాటికి నెంబర్ వన్‌కు ఇండియా, ఇండియన్స్ : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** వాజ్‌పేయి స్ఫూర్తిని యువతలో నింపేలా 'అటల్ సందేశ్... మోదీ సుపరిపాలన' యాత్ర తలపెట్టిన బీజేపీ కార్యవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు చేపట్టే 'అటల్ సందేశ్ – మోదీ సుపరిపాలన' యాత్రలో పాల్గొనాలని నేతలకు పిలుపునిచ్చారు. రాజకీయ భీష్మునిగా భావించే అటల్ జీ శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి నాంది పలికారని... ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాదిని వేశాయని గుర్తుచేశారు. వాజ్‌పేయి అజాత శత్రువని, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని అన్నారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్‌పేయి.. కష్టంతో ఎదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9 సార్లు లోక్‌సభకు, 2 సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందని సీఎం వెల్లడించారు. 18 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని.. 1998లో పోఖ్రాన్–2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తిని చాటారని కొనియాడారు. కార్గిల్ యుద్ధంతో శత్రువుకు తిరుగు లేని సమాధానం ఇచ్చారన్నారు. వాజ్‌పేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశ దశ దిశ మార్చిందన్నారు. తనకు వ్యక్తిగతంగా కూడా ఆయనతో అనుబంధం ఉందని.. రాష్ట్రాభివృద్ధిలో ఆయన నాడు ఎంతో సహాయం చేశారని తెలిపారు. రాష్ట్రం కోసం ఏది అడిగినా కాదనేవారు కాదన్నారు. ప్రజలకు పనికొచ్చే పనులు ఏం చెప్పినా చేస్తారని.. పాలసీల రూపకల్పన గురించి చాలా త్వరగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. టెలీ కమ్యూని కేషన్ రంగం, విమానయాన రంగంలో సంస్కరణలకు నాంది పలికారన్నారు. సుపరిపాలన ఏ విధంగా ఉండాలో ఎన్టీఆర్, వాజ్‌పేయిను చూస్తే అర్థమవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ కూడా విశిష్ట మైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని... పట్టుదల, అనునిత్యం మంచి చేయాలనే ఆలోచనతో ఉండేవారని ముఖ్యమంత్రి అన్నారు. నాడు అణు పరీక్షలు అయినా, నేడు సింధూర్ అయినా... నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047కు నెంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. 2047 నాటికి ఇండియా, ఇండియన్స్ నెంబర్ వన్ స్థానానికి వెళ్తారని ధీమా వ్యక్తం చేశారు. వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని విజయవంతం చేయాలని... 'అటల్ సందేశ్ – మోదీ సుపరిపాలన' కార్యక్రమాన్ని విజయంతం చేయాలని నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

## మేరా యువభారత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు





**ఎన్టీఆర్ జిల్లా, (రాజధాని వార్తలు):** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సార్ ఆర్ అండ్ సివిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు జిల్లా క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని అనేక బ్లాకు నందు వాలీబాల్ కబాడీ రన్నింగ్ షాట్ పుట్ పురుషులు మరియు మహిళ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం వారి వారి విభాగాల ప్రకారం వారికి క్రీడా పోటీలను నిర్వహించి జిల్లాస్థాయి విజేతలను ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మరియు ఈగల్ సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వీరాంజనేయులు పాల్గొని క్రీడా పోటీల ఆసక్తికరంగా తిలకించి అనంతరం కాలేజీ సెమినార్ హాల్ నందు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి శైలజ పిడి యుగంధర్ జిల్లా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె రమేష్ అందరితో కలిసి వాలిబాల్ పురుషులు కబాడీ మహిళలు షార్ట్ పుట్ రన్నింగ్ విభాగాలలో జిల్లా మొదటి విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలు మెడల్స్ మరియు సర్టిఫికెట్లు బహుకరించడం జరిగింది.

## హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తాం : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి, (రాజధాని వార్తలు):** జర్నలిస్టులపై దాడుల నివారణకు వీలుగా రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధి వర్గానికి హామీ ఇచ్చారు. సచివాలయంలో డిసెంబర్ 9వ తేదీ హోం మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గం జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీ, జిల్లా స్థాయిలో దాడుల నివారణ కమిటీలను నియమించాలని అందుకు వీలుగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే కమిటీ నియామకంపై తగిన చర్యలు తీసుకోవాలని ఓ ఎస్ డి అనిల్ కుమార్‌కి ఆదేశం ఇచ్చారు. మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గంలో ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులుతో పాటుగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిమి శ్రీ, ఎంబీనాథన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఆనంద్, చిన్న పత్రికల సంఘం నాయకులు హుస్సేన్ ఖాన్‌లు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక కలెక్టర్ కార్యాలయంలోనే తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ యం.వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి, డిపిఓ వసుమతి, సర్వేను ల్యాండ్ రికార్డ్స్ ఏడి రఘురామ రాజు వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో సైనికుల త్యాగాలను వెలకట్టలేనివి : కలెక్టర్ హిమాన్షు శుక్ల






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సాయుధ దళాల పతాక దినోత్సవంని పురస్కరించుకొని హుండీ డ్రైవ్ ను జిల్లా సైనిక బోర్డు చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టరు, హుండీలో తమ వంతు డబ్బులు వేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, సైనికుల కుటుంబాలకు సాయుధ దళాల పతాక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసారు. అంతే కాకుండా దేశ రక్షణలో సైనికుల త్యాగాలను వెలకట్టలేమని, వారి సంక్షేమానికి ఉపయోగించే సంక్షేమ నిధికి విరాళాలు సమీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ నిధికి రూ. 10 వేలు చొప్పున విరాళం అందజేసిన మాజీ సైనికులు మల్లిఖార్జున రావు మరియు కావలి సైనిక సొసైటీ వారిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ చొక్కా జేబుపై గౌరవ సూచకంగా ఆర్మీ సాయుధ దళాల స్టికర్‌ను అతికించి ధన్యవాదములు తెలిపినారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, జిల్లా సైనిక సంక్షేమ అధికారి, జి.హరికృష్ణ, ఇతర జిల్లా అధికారులు, ఎన్‌సిసి ఇంస్ట్రక్టర్స్, ఎన్‌సిసి కాడిడేట్స్, జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు కళాధర్, ఉపాధ్యక్షులు మేడేపల్లి రత్నయ్య మరియు మరియు ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 148 ఫిర్యాదులు స్వీక రణ. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్న జిల్లా యస్.పి. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.. ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. స్వయంగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 148 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

1. టిపి గూడూరు పరిధికి చెందిన వ్యక్తి యొక్క కుమారుడు తిరణాళ్ళకు వెళ్లి అనుమానాస్పదంగా గుండెపోటుతో మరణించినట్లు తెలపగా, టిపి గూడూరు స్టేషన్ నందు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసినట్లు, పోస్టుమార్టం రిపోర్టులో నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారని, తన కుమారుడు చనిపోయిన ప్రాంతాల్లో నీటి గుంట్లే లేవని, తన కుమారుడి మరణంపై అనుమానం ఉందని పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు. 2. వేదాయపాలెం పరిధికి చెందినటువంటి మహిళను, నెల్లూరు రూరల్ పరిధికి చెందినటువంటి హేమంత్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో పరిచయమై, పెళ్లి చేసుకుంటానని నమ్మించి 9 నెలలు కలిసి తిరిగినట్లు, ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడని, అడిగినందుకు తన తల్లితో కలిసి తనని కొట్టి బెదిరించారని విచారించి న్యాయం చేయాలని కోరారు. 3. రాపూరు పరిధికి చెందినటువంటి మహిళను, అదే ప్రాంతానికి చెందిన మార్కాపురం అనిల్ మరికొంతమంది తనపై గతంలో దాడి చేసి ఉన్నట్లు, దాని విషయంలో రాపూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ఉన్నట్లు, ఇంకనూ బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని, విచారించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 4. చిన్న బజారు పరిధికి చెందినటువంటి వ్యక్తిని యొక్క కుమార్తె నవంబర్ 7వ తేదీ నుంచి కనిపించడం లేదని, చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఉన్నట్లు, త్వరితగతిన విచారించి తన కుమార్తె యొక్క ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. 5. దర్గా మిట్ట పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త అత్తమామలు కుటుంబ వివాద విషయమై వేధింపులకు గురిచేస్తూ అధిక కట్నం కోసం వేధిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని అదేవిధంగా బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి మహిళను, అత్తమామలు, భర్త, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, పిల్లల లేరని, వదిలేసాడని, తనని నుండి గెంటి వేశారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. 6. కావలి టూ టౌన్ పరిధికి చెందినటువంటి వృద్ధుని, తన కుమారుడు సునీల్ తన ముసలితనాన్ని కూడా గుర్తించకుండా ఇంటి నుండి తరిమి వేసి ఇంటికి తాళం వేశాడని విచారించి న్యాయం చేయాలని అదేవిధంగా సంగం పరిధికి చెందినటువంటి వృద్ధురాలిని, తన కొడుకు ఏడుకొండలు తన జీవనాధారం కోసం ఇచ్చినటువంటి పొలాన్ని సాగు చేసుకోనికుండా ఇబ్బంది పెడుతున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా యస్.పి.. అజిత వేజెండ్ల, ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య రూరల్ డిఎస్పీ జి.శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, మహిళా స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్1-2 వెంకటేశ్వరరావు, ఎస్‌బి-2 సిఐ శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విక్రమ సింహపురి వర్సిటీ పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు డిసెంబర్ 12 చివరి తేదీ

**నెల్లూరు/కావలి, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్ల గడువును ఉన్నత విద్యా మండలి ఈ నెల డిసెంబర్ 12వ తేదీ వరకు పొడిగించింది. విద్యార్థుల అభ్యర్థనలు, ఇంకా భర్తీ చేయాల్సిన ఖాళీ సీట్లను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ముఖ్య వివరాలు అంశం వివరాలు గడువు పొడిగింపు డిసెంబర్ 12, 2025 వరకు అడ్మిషన్ కేంద్రాలు: 1. నెల్లూరు – కాకుటూరు ప్రధాన క్యాంపస్, 2. కావలి క్యాంపస్, సంప్రదించాల్సిన విభాగం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ హాజరు కావాల్సినవిఒరిజినల్ సర్టిఫికేట్లు ముఖ్య గమనిక ప్రవేశ పరీక్ష (ఎంట్రన్స్ టెస్ట్) రాయకపోయినా సీటు పొందే అవకాశం ఉంది. అధికారుల సూచన ఈ అడ్మిషన్ల గురించి డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. హనుమా రెడ్డి మాట్లాడుతూ, "ప్రవేశ పరీక్ష రాయకపోయినా పీజీ కోర్సుల్లో సీటు పొందే అవకాశం ఉన్నందున, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలి. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో డిసెంబర్ 12 లోపు DoA విభాగాన్ని సంప్రదించాలి," అని తెలిపారు.

# ధనలక్ష్మిపురంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించిన కమిషనర్ వై.ఓ నందన్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక 12వ డివిజన్ ధనలక్ష్మిపురం ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నిర్మిస్తున్న అపార్ట్మెంట్ నిర్మాణాన్ని కమిషనర్ పరిశీలించి పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన అనుమతులను తనిఖీ చేశారు. ఖాళీ స్థలం పన్నుతో పాటు భవనానికి కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క దుకాణానికి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. నిర్దేశించిన రోడ్డు మార్జిన్ దాటి వ్యాపారాలు నిర్వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని, రోడ్డు మార్జిన్ దాటిన వ్యాపారులను స్వచ్ఛందంగా మార్జిన్ పరిధిలోకి దుకాణాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని, అలా నిర్వహించని షాపులను తొలగిస్తామని కమిషనర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసి నెల్లూరులో శాంతిభద్రతలు కాపాడాలని కోరిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో వైఎస్‌ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి. జిల్లా ఎస్పీ అజిత వేజండ్లని కలిసి మెమోరాండం అందజేసి నెల్లూరు నగరంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. అలాగే వైసీపీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పై అన్యాయంగా పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేయాలని ఎస్పీని వారు కోరారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయి. నెల్లూరు నగరంలో పట్టపగలే అల్లరి మూకలు హత్యలకు తెగబడుతున్నారు. చిన్న చిన్న కారణాలతో క్షణికావేశంలో హత్యలు చేస్తు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నెల్లూరు నగరం శాంతియుతంగా మారాలని వైఎస్‌ఆర్సిపి మొదటి నుంచి పోరాటం చేస్తుంది. ఈరోజు నెల్లూరు జిల్లా ఎస్పీని కలిసి నగరంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరామన్నారు. నెల్లూరు నగరం ప్రశాంతంగా మారాలని అందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి సహకరిస్తుందని జిల్లా ఎస్పీకి తెలియజేశాం. డ్రగ్ తీసుకుంటూ హత్యలకు తెగబడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని ఎస్పీని కోరాం. కక్షపూరితంగా ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం గట్టిగా పని చేసే వ్యక్తి బొబ్బల శ్రీనివాస్ యాదవ్. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు జగన్మోహన్ రెడ్డిని చూడాలన్న ఆకాంక్షతో ముందు కొచ్చిన బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై పోలీసులు 307 కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేవలం 307 కేసు ఆధారంగా ఈరోజు బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేయడం తగదన్నారు. ఇలా రాజకీయంగా పెడుతున్న అక్రమ కేసులు మూలంగా రౌడీషీట్లు ఓపెన్ చేయడం సరికాదన్నారు. ఇలా అకారణంగా రౌడీ షీట్ ఓపెన్ చేయడం ఎంతో దారుణమని ఆ కుటుంబాన్ని మనోవేదనకు గురి చేయడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీని కలిసి వివరించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ ఈ అంశంపై క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారని అన్నారు. జరుగుతున్న అరాచకాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ప్రోత్సహించదని జరుగుతున్నా అరాచకాలన్నింటినీ ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. అయితే రాజకీయంగా అక్రమ కేసులు పెట్టి రౌడీషీట్లు ఓపెన్ చేయడాన్ని వైఎస్‌ఆర్సిపి సహించదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు ఉమా మహేష్, వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ బాలకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా కారుణ్య నియామకాలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కారుణ్య నియామకం ద్వారా నలుగురికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులను అందించారు. తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ శాఖలలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా నలుగురికి ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అందించారు. షేక్ అమిత్, కె. చందులకు రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సభార్డినేట్‌గా, ఎన్.నానికు పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా, యు.హరీష్ కుమార్‌కు వెల్ఫేర్ అండ్ ఎద్యుకేషన్ అసిస్టెంట్‌గా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులు అందించారు. విధుల పట్ల అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆలోచనలు, సూచనలు ఆదర్శనీయం అనుసరణీయం

## - సమాజానికి తిరిగి మనమేమిచ్చాము : డాక్టర్ నరసింహామూర్తి







**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఉన్నత పదవులు, ఉద్యోగాలు పొంది నువ్వు పుట్టిన ఊరికి ఎంతో కొంత తిరిగి చెల్లించాలని చెప్పిన ఆ మాటలను నిజం చేసి చూపాలనే ఆలోచనతో తాను పుట్టి పెరిగిన ఆ గ్రామానికి సేవ చేయటం ప్రారంభించారు విశ్రాంత వైద్యులు డాక్టర్ నరసిం హమూర్తి. అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత వైద్యులు డాక్టర్ పరమట నరసింహమూర్తి తాను పుట్టిన తుమ్మలపల్లి గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ గ్రామస్తులందరిని పిలిచి ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసారు. కాట్రు శాంతి కిరణ్ అధ్యక్షతన డాక్టర్ పరమట నరసింహామూర్తి ముఖ్య అతిధిగా గ్రామస్తుల అందరితో సమావేశం నిర్వహించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ వ్రాసిన, అనేక సందర్భాల్లో బహిరంగ వేదికలపై ఆయన చెప్పిన నినాదం (పే బ్యాక్ టు సొసైటీ) సమాజానికి నువ్వు తిరిగి ఏమిచ్చావ్ అన్న మాటకు కట్టుబడిన స్వగ్రామమైన తుమ్మలపల్లిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. ఉన్నత పదవులు, ఉద్యోగాలు చేస్తున్నప్పటికి నువ్వు పుట్టిన ఊరికి ఎంతో కొంత తిరిగి చెల్లించాలని చెప్పిన ఆ మాటను నిజం చేసి చూపాలని ఆలోచనతో ఉన్నత వైద్య విద్యను అభ్యశించి అనేక మంది పేద ప్రజలకు వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడగలిగానన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు పేదలకు ఉచిత వైద్యాన్ని సైతం అందించానన్నారు. అంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తితో గత 25 సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతిని, వర్ధంతిని పురస్కరించుకొని గ్రామానికి, గ్రామ ప్రజలకు సౌకర్యార్థం లక్షలాది రూపాయలు వెచ్చించి కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. గతంలో గ్రామ ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహం ఎదురుగా సుమారు 25 సంవత్సరాల క్రితం మా తల్లీదండ్రుల పేరిట రూ.3.5 లక్షలు వెచ్చించి బస్ షెల్టర్ నిర్మించానని తెలిపారు. అలానే గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయగా నిర్మాణానికి అనువైన స్థలం దొరకక ఇబ్బంది పడుతున్న సమయంలో నా సొంత స్థలంతో పాటు సుమారు 264 గజాల స్థలం కొనుగోలు చేసి గ్రామ పంచాయితీకి దానంగా వ్రాసి ఇచ్చానన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఈరోజు గ్రామంలో సుమారు 150 మంది పేద, వృద్ధులకు, వికలాం గులకు రగ్గులు పంపిణీ చేశానన్నారు. నేను తలపెట్టిన సేవా కార్యక్రమంలో నాతో పాటు నాకు మారులు సారధి, కృష్ణమోహన్‌లు భాగస్వామ్యం కావటం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. నామొదటి కుమారుడు పరమట సారధి (ఆంధ్రా కిచెన్ రిస్టోరెంట్స్-జపాన్‌లో నాలుగు బ్రాంచ్‌లు), రెండో కుమారుడు కృష్ణమోహన్ (సివిల్ ఇంజనీర్) ఇరువురు నా సేవాభావాన్ని అందిపుచ్చుకుని వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారన్నారు. భవిష్యత్‌లో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగించేందుకు వారిరువురు నా పేరిట డాక్టర్ పి ఎన్ ఎం చారిటబుల్ ట్రస్ట్ (డాక్టర్. పరమట నరసిం హామూర్తి చారిటబుల్ ట్రస్టు) త్వరలోనే ప్రారం భిస్తున్నారని తెలియజేయటానికి సంతోషిస్తున్నానన్నారు. ఈ ట్రస్టు ముఖ్య ఉద్దేశం విద్యలో అధ్యధిక మెరిట్ సాధించిన దళిత,పేద విద్యార్థులకు స్కాలర్షిప్ ఏర్పాటు చేసి విద్యను ప్రోత్సహించటమన్నారు. ఇకపై జరిగే ప్రతి కార్యక్రమం డాక్టర్ పిఎన్ఎం చారిటబుల్ ట్రస్ట్ పేరిట నిర్వహిస్తామని పరమట కృష్ణ మోహన్ తెలిపారు. అనంతరం గ్రామస్థులందరికి నరసింహమూర్తి భోజనాలు ఏర్పాటు చేసి అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వడ్డీ సుభాషిని, ఎంపీటిసి, పులుసు గంటి రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కాఫీ కొనుగోలుకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి : కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

**పాడేరు, (రాజధాని వార్తలు):** మన్యంలో కాఫీ రైతులను మరింతగా ప్రోత్సహించేందుకు 'కాఫీ రైతు బజార్'లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. మన్యంలో కాఫీ మార్కెటింగ్, నాణ్యతపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యం కాఫీకి అరకు కాఫీగా ప్రపంచ స్థాయిలో చక్కని గుర్తింపు ఉందన్నారు. ఈ గుర్తింపుపై ఎటువంటి మచ్చపడకుండా కాఫీ క్రయవిక్రయాలు జరగాలని, నాణ్యత సైతం మరింతగా పెరగాలన్నారు. కాఫీ ఫల్పింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేసుకునే రైతులకు 30 శాతం రాయితీపై అవసరమైన యంత్ర పరికరాలను అందిస్తామన్నారు. జి.మాడుగుల, జీకేవీధి ప్రాంతాల్లో కాఫీ పల్పింగ్ యూనిట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో శ్రీపూజను ఆదేశించారు. గిరిజన రైతులను ప్రోత్సాహించేందుకు చింతపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు.

# ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం





**దక్కిలి, (రాజధాని వార్తలు):** దక్కిలి మండలంలోని భవిత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవము ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ దివ్యాంగుల దినోత్సవము భాగంగా ఎంఇఓ-1 వెంకటేశ్వర్లు హైస్కూల్ హెచ్ఎం గీతా మరియు హైస్కూల్ స్టాఫ్ పాల్గొనడం జరిగింది, విద్యార్థులను మరియు తల్లీతండ్రీలను ఉద్దేశించి ఎంఇఓ-1 కె.వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం గీతా మరియు భవిత స్కూల్ టీచర్ ఐఇఆర్‌టి జె.వాసవి మాట్లాడం జరిగింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన పథకాలు, allowencelu, Medical camps గురించి మరియు ఫీజియోథెరఫీ గురించి వివరించడం జరిగింది.

ఈ దివ్యంగుల దినోత్సవములో భాగంగా ఫీజితేరఫిస్ట్ సరితా, ఈశ్వరమ్మ పాల్గొనడం జరిగింది. ఈ ప్రపంచ దివ్యంగుల దినోత్సవము పాల్గొని నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు.

# కోర్టు కేసుల మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

## - డిసెంబర్ 13న నేషనల్ లోక్ అదాలత్ : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, ట్రేడ్ లైసెన్సు పన్నుల బకాయిదారులు, అనధికార నిర్మాణాలు లేదా అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణ యజమానులుపై క్రిమినల్ చర్యలకు న్యాయస్థానాల ద్వారా దాఖలు చేసిన కేసులను మాఫీ చేసుకునేందుకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలోని కమిషనర్ చాంబర్లో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావుతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నగరపాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను బకాయి దారులకు సంబంధిత విభాగాల నుంచి నోటీసులను జారీ చేసిఉన్నామని, వారంతా నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో రాబోవు డిసెంబర్ నెల 13వ తేదీన శనివారం నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌కు హాజరై కోర్టు కేసులను మాఫీ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్న లోక్ అదాలత్ ద్వారా రెవెన్యూ బకాయిలు ఉన్న 1956 మందికి, తాగునీటి కుళాయి పన్నులు బకాయిలు ఉన్న 5996 మందికి, ట్రేడ్ లైసెన్సులు బకాయిలు ఉన్న 700 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేసి ఉన్నామని, సుమారుగా 27 కోట్ల వరకు ఉన్న బకాయిల మొత్తాలను అపరాధ రుసుముతో సహా చెల్లించి వారిపై నమోదయున్న కేసులను మాఫీ చేయించుకునేలా చర్యలు తీసుకోనున్నామని కమిషనర్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రాంగణంలో ఆరోజు ఏర్పాటు చేసే ఎన్.ఎమ్.సి పన్నుల వసూలు కేంద్రంలో చెల్లింపులు జరపవచ్చని, బకాయిలను అపరాధ రుసుముతో సహా చెల్లించని వారిపై మూడు సంవత్సరముల వరకు కారాగార శిక్ష విధించేందుకు చట్టం అనుమతిస్తుందని కమిషనర్ తెలియజేశారు. గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాల మేరకు ప్రతి 3 నెలలకు నేషనల్ లోక్ అదాలత్ ను నిర్వహిస్తారని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తారని కమిషనర్ తెలిపారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకే డీబీఆర్సీ ఆర్థిక సాయం

## - 2500 నిరుపేద దళిత కుంటుంబాలకు రూ.4,500 లబ్ధి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా అట్టడుగు వర్గాలుగా ఉన్న దళిత, బహుజన వర్గాలకు విపత్తుల సమయంలో చేయూతనందించి అండగా నిలవాలనే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్సి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడ దేవకుమార్ అన్నారు. తీర ప్రాంతాలలో నివసిస్తూ విపత్తుల సమయంలో ఇబ్బందులకు గురైన దళిత, బహుజన కుటుంబాలకు చేయూ తనందించి ఆసరాగా నిలిచేందుకు నేరుగా వారి ఖాతాల్లోకి ఆర్ధిక సాయాన్ని జమ చేస్తున్నట్లు డీబీఆర్సీ దేవకుమార్ అన్నారు. మొంథా తుపాను వల్ల తీరప్రాంతంలో దెబ్బతిన్న గృహాలకు సంబందించి రూ. 4,500 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు కొడప ప్రాంతంలో సోమవారం డీబీఆర్సీ నాయ కులు అందజేశారు. ఈ కార్యక్రమానికి డీబీఆర్సీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దేవకుమార్‌తోపాటు డిప్యూటీ డైరెక్టర్‌లు నాగలక్ష్మి, సామ్యూల్ అనిల్‌కుమార్, స్టేట్ కోఆర్డినేటర్ హేమలత, డీబీఆర్సీ ప్రతినిధులు అల్లాడి జెస్సీ, రవికిరణ్, శ్రీనివాస్ తదితరులు హాజరై ఆర్థిక సాయం మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దేవకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 12 తీర గ్రామాల్లోని 2500 కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్, స్టార్ట్ నెట్ వర్క్, సీఏఐడీ సంయుక్తంగా ఈ ఆర్థిక సాయాన్ని అందజేశాయన్నారు. ఎటువంటి మధ్యవర్తులు అన్న ప్రసక్తే లేకుండా నేరుగా లబ్ధిదారులకు వ్యక్తిగత ఖాతాల్లోకి ఈ ఆర్థిక సాయం జమచేసినట్లు ఆయన వెల్లడించారు. డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి డీబీఆర్సీ విశేష కృషిచేస్తోందని అంబేడ్కర్ ఆశయ సాధనకు తమ పిల్లలను తల్లితండ్రులు బాగా చదివించాలని సూచించారు. స్టేట్ కో ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ మహిళలు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని తమ కుటుంబాలను ఆర్థికంగా తీర్చిదిద్దుకునేందకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కె. సుధీర్, యాళ్ల సోమరాజు, బొంతు వీరబాబు, భూపతి భాస్కర రావు, యాళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ అక్రమంగా రౌడీ షీట్‌ను పరిశీలించి న్యాయం చేయాలని ఎస్పీని కలిసిన ఆనం విజయ్ కుమార్ రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు నగర అధ్యక్షుడు మరియు 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ మీద పెట్టినటువంటి అక్రమంగా రౌడీ షీటర్‌ను పరిశీలించి న్యాయం చేయాలని ఎస్.పిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ రౌడీలను పెంచి పోషించింది ఎవరనేది అందరికీ తెలుసు. నెల్లూరు రూరల్ కార్యాలయం నుంచే అంతా జరుగుతుంది. నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై రౌడీషీట్ ఓపెన్ చేయడం దారుణం. రూరల్ కార్యాలయం వద్దకు వెళితే తెలుస్తుంది. రౌడీలు ఎక్కడ ఉన్నారనేది. గంజాయి ముఠాలు, గ్యాంగ్‌లు, రౌడీలకు 70 ఏళ్ళ రాజకీయ చరిత్రలో ప్రత్యక్ష ప్రమేయం ఉండేది కాదు. శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాకే ఈ పరిస్థితి. ఇతర పార్టీల కార్యకర్తలు తమ పార్టీలోకి రాకపోతే కేసులతో భయపెట్టడం, బెదిరింపు చర్యలు ప్రజలు చూస్తున్నారు. జిల్లాలో ఇటువంటి దరిద్ర రాజకీయాలు ఎక్కడా లేవు. 10 నియోజకవర్గాలో 9 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారి పనివాళ్లు చేసుకుపోతున్నారు.

ఒక్క రూరల్‌లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. టీడీపీ పార్టీ నాయకుల మాతంగి కృష్ణ, తిరుమలనాయుడిని కొట్టింది ఎవరనేది అందరికీ తెలుసు. గంజాయి ముఠాల చేతుల్లో హత్యకు గురైన పెంచలయ్యకు సానుభూతి తెలిపాము. జిల్లా బంద్‌కు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలిపింది.

నెత్తురు తడిచిన చేతులను డబ్బులతో కడుక్కునే వారిని ప్రక్కన పెట్టుకున్నారు. నెల్లూరు ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారు. అందరూ ఖండించాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండుసార్లు బయోమెట్రిక్ తప్పనిసరి : ఎంపీ డివో

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** సచివాలయ సిబ్బందికి ఉదయం సాయంత్రం రెండు పూటలా బయోమెట్రిక్ తప్పనిసరి అని ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సూర్యనారా యణ డిప్యూటీ ఎంపీడీవో, మండల పరిధిలోని జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికార వై శ్రీహరి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాజాగా మండల జి ఎఫ్ డబ్ల్యూ ఎస్ అధికారిగా పదోన్నతిపై నియమితులైన వై శ్రీహరిని ఎంపీడీవో సూర్యనారాయణ సిబ్బందికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం రెండుసార్లు బయోమెట్రిక్



అటెండెన్స్ కచ్చితంగా నమోదు చేయాలన్నారు. సర్వేలో అందరు సచివాలయం ఉద్యోగులు పాల్గొని సర్వేలు అన్ని సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఇంకా పలు అంశాలపై వారు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# సంపాదకీయం

## పెళ్లినాటి ప్రమాణాలూ ప్రమాదాలూ

గతంలో ప్రేయసి వలలో పడి భార్యను చంపే భర్తల గురించే వినేవాళ్లం, పేపర్లలో చదివేవాళ్లం. ఇప్పుడు భార్యలు ఈ పోటీలో భర్తలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోంది. ప్రియుడితో కలిసి గూడుపుఠాణీ చేసి, ప్రీమెడిటేటెడ్, కోల్డ్ బ్లడెడ్ మర్డర్లు కూడా చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. జీవితాంతం కలిసి నడుస్తామంటూ పెళ్లి సమయంలో చేసిన ప్రమాణాలు ఏమై పోతున్నాయో తెలియటం లేదు. ప్రమాణాలు కేవలం నోటిమాటలుగా మిగిలిపోకుండా, ఆచరణలో కూడా చూపాలంటే సరైన ఆటిట్యూడ్ వుండాలి. 'ఈ నా వివాహాన్ని వర్కబుల్ చేస్తాను' అని దృఢంగా సంకల్పించుకోవాలి కూడా. దానికి అనుగుణంగా మరో ప్రమాణాన్ని కూడా చేరిస్తే మంచిదనిపిస్తోంది. భర్తలను భార్యలు చంపిస్తున్న కొన్ని సందర్భాల్లో పెళ్లికి ముందే ఈ ప్రీమెడిటేషన్ ప్రారంభమవుతోందని తెలుస్తోంది. ప్రియుడికి ఉద్యోగం, వేరేవాణ్ణి పెళ్లి చేసుకుని, వాణ్ణి ప్రియుడి ద్వారా చంపించి, ఆస్తికి వారసురాలై, తర్వాత ప్రియుణ్ణి పెళ్లాడి హాయిగా సెటిలైపోదామనే ప్లాన్లు కూడా వేస్తున్నారు. ఇలాంటి కేసుల్లో హనీమూన్‌లో హనీ కంటే పాయిజన్ పాలు ఎక్కువవుతోంది. ఇవి విన్నప్పుడు 'వీరికి తమ పెళ్లినాటి ప్రమాణాలు గుర్తుకు రావా? లేక చిత్తశుద్ధి లేని ప్రమాణాలు చేస్తున్నారా?' అనే అనుమానం వస్తుంది. ఈ ప్రమాణాలన్నీ ఒకరికొకరు జీవితాంతం బద్ధులమై ఉంటామని, అచంచలమైన పరస్పర విశ్వాసాన్ని కలిగి ఉంటామనీ చెప్పిస్తాయి. క్రైస్తవ వివాహాల సమయంలో 'ఈ రోజు నుంచి, సుఖంలోనూ, దుఃఖంలోనూ, ఐశ్వర్యంలోనూ పేదరికంలోనూ, ఆరోగ్యంలోనూ అనారోగ్యంలోనూ మృత్యువు మమ్మల్ని విడదీసేదాకా కలిసే ఉంటాము' అని క్రైస్తవ దంపతులు ప్రమాణం చేస్తారు. హిందూ వివాహాల్లో తాళి కడుతూ 'నేను నీ మెడలో కడుతున్న ఈ మంగళ సూత్రం నా జీవితానికి ఆధారం. నీవు నూరేళ్లు బతికి నన్ను కూడా బతికించు' అనే అర్థంలో 'మాంగల్యం తంతునానేనా, మమ జీవన హేతునా' మంత్రాన్ని పలిస్తాడు. దీనికి గాను తన వంతుగా ఏం చేస్తాడో మరో మంత్రంతో చెప్తాడు 'ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ... నాతి చరామి' అని. ధర్మంలో, ధనార్జనలో, కోరికలో, మోక్షంలో.. నిన్ను దాటి వెళ్లను. నీతోనే ఉంటాను' అని దాని అర్థం. జీవితానికి అతి ముఖ్యమైన ఈ నాలుగు పురుషార్థాలలోనూ కలిసి ఉంటానని చెప్పడం ఆజన్మాంత జీవన సహచర్యానికి నిర్వచనమే! ఆ తర్వాత ఇద్దరూ 'సప్తపది' పేర ఏడడుగులు కలిసి నడుస్తారు. ఒక్కొక్క అడుగుకూ ఒక్కొక్కటి చొప్పున వధువుకు వరుడు సూచనలు చేస్తాడు. 'నువ్వు నాకు పోషణ కలిగించాలి', 'నాకు శక్తి, ఉత్సాహాలను కలిగించాలి', 'కుటుంబానికి ఐశ్వర్యాన్ని తేవాలి', 'ఆనందాన్ని కలిగించాలి', 'సంతానాన్ని సమకూర్చాలి', 'అన్ని ఋతువులలోనూ మనం కలిసి జీవించాలి' (ఇక్కడ అన్ని ఋతువులు అనడంలో వసంతం నుంచి శిశిరం దాకా అనే కాదు, కలిమిలో లేమిలో, కష్టాల్లో సుఖాల్లో.. అనే భావం యిమిడి ఉంది), చివరగా ఏడో అడుగులో చెప్తాడు. 'మన మధ్య శాశ్వతమైన స్నేహం ఉండాలి' అని. నిజానికి ఈ స్నేహమే వైవాహిక బంధాన్ని నిలిపి ఉంచుతుంది. స్నేహితులు మధ్యమధ్యలో వాదించుకుంటారు, కొట్లాడుకుంటారు. కానీ ఒకరంటే మరొకరికి గాఢమైన ఇష్టం ఉంటుంది. స్నేహానికి తైలం అనే అర్థం కూడా ఉంది. దాంపత్యజ్యోతి నిరంతరం వెలగాలంటే భార్యాభర్తల మధ్య ఈ స్నేహం చాలా ముఖ్యం. సంప్రదాయబద్ధంగా జరిగే పెళ్లిళ్లలో ఏదో రకంగా ప్రమాణాలు చేయిస్తూనే ఉన్నారు. కొంతకాలానికి పెళ్లిళ్లలో కలతలు రావడం, విడాకులు తీసుకోవడం... చివరకు పైన చెప్పిన హత్యాకాండల గురించి విన్నప్పుడు ఈ ప్రమాణాల ప్రామాణికత ఏమిటన్న సందేహం వస్తుంది. ఆనాటి బాసలు నీరసించడం, సడలిపోవడం క్రమేపీ జరుగుతోందనే సంగతిని మనం ఆకళింపు చేసుకోవాలి. చాలా సందర్భాల్లో భార్యాభర్తలకు ఒకరిపై మరొకరికి మోజు విరిగిపోవడం, విభేదాలు పొడచూపడం జరుగుతోంది. వీటిని కాలంతో పాటు వచ్చే మార్పులుగా అర్థం చేసుకోవాలి. తమాషా ఏమిటంటే పరిస్థితులు మారవు, కానీ వాటిని చూసే దృక్కోణంలో మాత్రం మార్పు వస్తుంది. ఒకప్పుడు ప్రేమతో, ఆరాధనతో నిండి తనను మంత్రముగ్ధుణ్ణి చేసిన భార్య అందమైన కళ్లే, కోపంతో పెద్దవై, నిప్పురవ్వలు కురిపించడం భర్తకు కలిగే అనుభవం. స్వీట్ నథింగ్స్‌తో తనను పులకింపచేసిన భర్త కంఠస్వరమే తన మాట చెల్లనప్పుడు చికాకుతో గర్జించడం భార్య నివ్వెరపోయే సందర్భం. భర్త వినే సంగీతం పెళ్లయిన కొత్తల్లో ఆహ్లాదకరంగా భావించిన భార్య, పోనుపోను దాన్ని వట్టి రొదగా కొట్టిపారేయడం కద్దు. భార్య తీసే కూనిరాగాలను ఒకప్పుడు శ్రావ్యంగా భావించిన భర్త తర్వాతి రోజుల్లో వాటినే ఖూనీరాగాలుగా భావించడం కాలమహిమ కాక మరేమిటి? ఈ కారణంగా భార్యాభర్తలిద్దరి ప్రవర్తనల్లోనూ మార్పులు వస్తాయి. చెవిలో గుసగుసలు, ముసిముసి నవ్వుల స్థానంలో పక్కింటి వాళ్లకు కూడా వినబడే స్థాయిలో అరుపులు, రంకెలుగా రూపాంతరం చెందుతాయి. ఇద్దరూ కలిసి ప్రేమగా ఏరికోరి కొన్న గాజు, పింగాణీ వస్తువులు నేల కూలి ముక్కలవుతాయి. గిన్నెలు సొట్టబడతాయి. ఒకప్పుడు అపురూపంగా దాచుకున్న ఉత్తరాలు, ఫొటోలు కోపావేశంలో చిరిగి ముక్కలవుతాయి. ఏదో ఒక స్థాయిలో ప్రతి జంటకూ ఇలాంటి అనుభవాలు ఉంటాయి. టాల్‌స్టాయ్ నుంచి గాంధీ దాకా గృహ కలహాలను ఎవరూ తప్పించుకోలేకపోయారు. కానీ పోట్లాడుకున్న వాళ్లందరూ విడిపోరు. 'పిల్లల కోసం కలిసి ఉంటున్నారు పాపం' అని బయటివాళ్లు అనుకోవచ్చు కానీ వాస్తవమేమిటంటే వయస్సు, అనుభవం పెరుగుతున్న కొద్దీ, చాలా మంది దంపతులకు 'కలిసి బతకలేం, అలా అని విడిపోయీ బతకలేం' అనే అవగాహన కలుగుతుంది. విడిపోయీ బతకగలం అనుకున్న వాళ్లు విడిపోతారు.

# స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చెయ్యాలి

### - కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ స్టీల్ ప్లాంట్ గేట్ వద్ద నిర్వాసితులు చేస్తున్న ధర్నాలో కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు స్టీల్ ప్లాంట్‌ని కాపాడతాం అని ఎన్నికల ముందు హామీలు ఇచ్చాయి, ఇప్పుడు అందరు స్టీల్ ప్లాంట్ విషయం గాలికి వదిలేసాయి అని ఆమె విమర్శించారు. దేశంలో 130 మిలియన్ టోన్నులు స్టీల్ ఉత్పత్తి చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది, విశాఖ స్టీల్ ప్లాంట్ ని చంపేస్తే లక్ష్యం ఎలా చేరుకుంటుందని ఆమె ప్రశ్నించారు. ఉద్యమాన్ని మెల్లిగా పలచన చేసి అదానికి అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ మరియు నిర్వాసితులతో కాంగ్రెస్ పోరాటం చేసి కాపాడుకుంటుందని ఆమె అన్నారు. నాలుగో తరం వచ్చిన భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఇంతవరకు ఉద్యోగం ఇవ్వలేదని, వారికి ఉద్యోగం ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి 25000 ఇచ్చి వారిని ఆదుకోవాలని ప్రియాంక డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాండవ గాయత్రి, గాజువాక మాజీ కన్వీనర్ గవర వెంకటరమణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# కేకే రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వాసుపల్లి

### - శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించిన మాజీ ఎమ్మెల్యే గణేశ్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శ్రీవారి చిత్రపటాన్ని బహుకరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌తో కలిసి కేకే రాజుకి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వాసుపల్లి గణేష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేకే రాజు మరిన్ని జన్మదిన వేడుకలు సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, కార్పొరేటర్ బిపిన్ జైన్, జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంటూ ఆనంద్, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ చోడిపిల్లి శివ, వార్డ్ యూత్ ప్రెసిడెంట్ చేపల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులను సత్కరించిన డాక్టర్ కందుల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న కళాకారులను విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అమ్మవారి ఖ్యాతితోపాటు తెలుగు వారి సాంస్కృతిక సాంప్రదాయాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆలయ ఈవో శోభారాణి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు భక్తుల నుంచి అలాగే స్థానిక ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. మంచి కార్యక్రమాలకు ఎప్పుడు మంచి స్పందన ఉంటుందని తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు పాల్గొన్న వారందరికీ అమ్మవారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఈ ఈ సిహెచ్ వి రమణ, ఏఈఓలు నరేంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 86 వినతులు : అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 86 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ విభాగాధిపతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 86 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 01, 2వ జోన్ కు 08, 3వ జోన్ కు 21, 4వ జోన్ కు 06, 5వ జోన్‌కు 11, 6వ జోనుకు 22, 8వ జోన్‌కు 06, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 13, రెవెన్యూ విభాగమునకు 12, ప్రజారోగ్య విభాగమునకు 04, పట్టణ ప్రణాళిక విభాగమునకు 33, ఇంజినీరింగు విభాగమునకు 18, మొక్కల విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 03 కలిపి మొత్తంగా 86 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం అదనపు కమిషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.వి.వి సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ ఎన్ వి నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, డిసిఆర్ ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వి. రమణ,డిడిహెచ్ ఎం. దామోదరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసిపిలు, ఎసిపిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌ను విధిగా ధరించండి... ప్రాణాలు కాపాడుకోండి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** వాహనదారులు హెల్మెట్‌ను విధిగా తప్పనిసరిగా ధరించి ప్రమాదాలు బారిన పడకుండా ప్రాణాలను కాపాడుకోవాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్.పి రాహుల్ మీనా ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ సి.ఐ, ప్రశాంత్ కుమార్, ఉప్పలగుప్తం ఎస్.ఐ రాజేష్‌లు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహన చోదకులు హెల్మెట్‌లను విధిగా ధరించాలని సి.ఐ, డి.ప్రశాంత్ కుమార్ సూచించారు. సిరిపల్లి–మునిపల్లి ప్రధాన రహదారిలో సన్నవిల్లి సెంటర్ వద్ద ద్విచక్ర వాహన చోదకులను ఆపి వారికి హెల్మెట్ వినియోగం ప్రయోజనాలపై అవగాహన కల్పించి వారిచే హెల్మెట్‌లను కొనుగోలు చేయించారు. తప్పనిసరిగా హెల్మెట్‌లను ధరించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్‌లు మాట్లాడవద్దని వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణించి క్షేమంగా గమ్యం చేరుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ ప్రశాంత్ కుమార్ హెచ్చరించారు. ఉప్పలగుప్తం ఎస్.ఐ సి.హెచ్.రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివారపు సంత మార్కెట్లో విద్యుత్ వైర్లు చోరీ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం వారపు సంత మార్కెట్లో వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డులోని విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పెద్దాపురం వారపు సంత మార్కెట్ పాత ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో కొనసాగుతుండగా వ్యాపారులకు ఆదివారం రోజున తరలి వచ్చే ప్రజలకు ఎండలు, వానలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా వారికి వ్యాపార సైడ్‌లో నిర్మించేందుకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఏర్పాట్లు చేశారు. వారి కొరకు నిర్మించిన నూతన షెడ్యూల్‌లో చీకటి పడిన తర్వాత కూడా వ్యాపారాలు కొనసాగించు కునేందుకు వీలుగా విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. అయితే దానికి సంబంధించిన ఖరీదైన విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. వ్యాపారులు ఆ విషయాన్ని గుర్తిం చడంతో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దానితో చోరీకి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందినట్టు తెలిసింది. విద్యుత్ వైర్లు, విద్యుత్ స్విచ్ బోర్డులు అపహరణకు గురైనందున దొంగలను గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని, వ్యాపారులు కోరుతున్నారు.

# పార్టీలకు అతీతంగా ఉచిత గ్యాస్ సిలిండర్ కిట్ల పంపిణీ : రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో పార్టీలకు అతీతంగా అర్హులైన వార్కి ఉచిత గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యు లేటర్‌తో కూడిన కిట్ల పంపిణీ చేసినట్లు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ గుడారిగుంటలో రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ క్యాంపు కార్యాలయం వద్ద సివిల్ సప్లై విభాగం వారు ఏర్పాటు చేసిన ఉజ్వల 3.0 పథకం ద్వారా అర్హులైన 763 మంది మహిళా లబ్ధిదారు లకు రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్‌తో కూడిన గ్యాస్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంగా ఉజ్వల 3.0 ద్వారా ఉచితంగా కనెక్షన్ మంజూరు చేసి అందజేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు, నూరుకుర్తి వెంకటేశ్వర రావు, రంభాల వెంకటేశ్వర రావు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, కరెడ్ల గోవింద్, బండారు మురళి, మాదారపు తాతాజీ, పితాని లీల, బందిలి వీరీష, బోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, మెండు గోవింద్, బోళ్ల కృష్ణ మోహన్, పోసిన రాము, రాములు, ఫణి, యాళ్ల సత్యనారాయణ, సోదే ముసలయ్య, కృష్ణ, బత్తుల సతీష్, ముత్యాలరావు, డి.ఎస్. ఓ సత్యనారాయణ రాజు, ఎం.ఎస్.ఓ వీర స్వామి, రూరల్ ఎమ్ఆర్ఓ కుమారి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి, పిల్లలపై ఆలోచన లేదు.. కానీ!



ఈమె ఒక ప్రముఖ నటి.. కానీ ఓ విషాదం కారణంగా ఎంతో ట్రోలింగ్‌ని ఎదుర్కొంది. సోషల్ మీడియాలో ఈమెపై వచ్చిన నెగిటివిటీకి సున్నిత మనస్కులు అయితే సూసైడ్ చేసుకునేవారు. కానీ ఈమె ధైర్యంగా పోరాడి నిలిచింది. బాయ్ ఫ్రెండ్ సూసైడ్ తర్వాత ఈ హీరోయిన్‌పై ఎంతో దుష్ప్రచారం జరిగింది. కానీ చివరి వరకు పోరాడింది. ఇక ఆ నటి ఎవరంటే రియా చక్రవర్తి.. బాలీవుడ్ నటి రియా చక్రవర్తి అంటే సౌత్ ప్రేక్షకులకు కూడా సుపరిచితమే.అయితే అలాంటి ఈ హీరోయిన్ సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మరణం తర్వాత తరచూ ట్రోలింగ్‌ని ఎదుర్కొంది. రియా చక్రవర్తి వల్లే సుశాంత్ సూసైడ్ చేసుకున్నారనే ప్రచారం జోరుగా వినిపించింది. సుశాంత్ సూసైడ్ కేసులో రియా చక్రవర్తి,ఆమె సోదరుడు ఇద్దరు జైలు జీవితం కూడా గడిపారు. కానీ ఆ తర్వాత వీరిద్దరూ నిర్దోషులుగా బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదంతా పక్కన పెడితే.. తాజాగా నటి రియా చక్రవర్తి పెళ్లి , పిల్లలపై ఇప్పుడు ఆలోచన లేదు..కానీ దాని గురించి ఆలోచిస్తున్నాను అంటూ ఓ షాకింగ్ విషయాన్ని బయట పెట్టింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రియా చక్రవర్తి మాట్లాడుతూ.. “నేను ఈ మధ్యనే ఓ గైనకాలజిస్ట్ ని కలిసాను. ఆమెతో ఎగ్ ఫ్రీజింగ్ గురించి అడిగి తెలుసుకున్నాను. ఎందుకంటే నా వయసు ఇప్పుడు 33 సంవత్సరాలు. ప్రస్తుతం కెరియర్లో సెట్ కాలేదు. కాబట్టి పెళ్లి, పిల్లల గురించి ఇప్పుడు ఆలోచించలేను. కానీ ప్రతి ఒక్క మహిళలో ఓ వయసు రాగానే పిల్లల గురించి ఆలోచించమని చెబుతారు. అందుకే నేను కూడా ఎగ్ ఫ్రీజింగ్ చేయాలి అనుకుంటున్నాను. నేను ఇప్పటివరకు కెరియర్‌లో అంత సెట్ కాలేదు. ప్రస్తుతం నా మనసంతా కెరియర్లో సెట్ అయ్యి ఆ తర్వాత పెళ్లి, పిల్లల గురించి ఆలోచించమని చెబుతుంది. అందుకే ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని, పిల్లల్ని కనాలనే ఆలోచన లేదు. కానీ ఎగ్స్ ఫ్రీజింగ్ చేయాలి అనుకుంటున్నాను.. అంటూ రియా చక్రవర్తి తాజాగా పాడ్ కాస్ట్ చాప్టర్ 2 లో అతిధి హ్యూమా ఖురేషితో మాట్లాడుతూ ఈ విషయాన్ని పంచుకుంది. అయితే గతంలో రియా చక్రవర్తి హ్యూమన్స్ ఆఫ్ బాంబేతో జరిపిన సంభాషణలో మాట్లాడుతూ.. “పెళ్లి చేసుకోవడానికి సరైన వయసుపై నాకు నమ్మకం లేదు.అలాగే పెళ్లి వయసు దాటి ఓ ఏజ్ వచ్చాక పెళ్లి చేసుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు” అని చెప్పింది.అంటే రియా చక్రవర్తి లైఫ్ లో సెటిల్ అయ్యాకే అంటే లేటు వయసులో పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఇలా ఎగ్స్ ఫ్రీజింగ్ ప్రక్రియను ఎంచుకున్నట్టు అర్థమవుతుంది. అలా 33 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకొని కుటుంబాన్ని ప్రారంభించాలి అనేదాని గురించి ఆలోచించే కంటే ముందే కెరీర్‌లో సాధించాల్సినవి చాలా ఉన్నాయని రియా చక్రవర్తి భావిస్తోంది. ఇక రియా చక్రవర్తి తెలుగులో చేసిన ఏకైక మూవీ సుమంత్ అశ్విన్ హీరోగా వచ్చిన తూనీగ తూనీగ..ఈ సినిమా తర్వాత మళ్లీ రియా చక్రవర్తి తెలుగులో కనిపించలేదు.

# సుమ కొడుకు మూవీ వాయిదా పడినట్లేనా? మరి వచ్చేదెప్పుడు?



యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాల గురించి అందరికీ తెలిసిందే. నిర్మలా కాన్వెంట్ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన రోషన్.. ఆ సినిమాలో సహాయక పాత్రలో నటించారు. ఆ తర్వాత బబుల్ గమ్ సినిమాతో హీరోగా మారారు. కంటెంట్ ఓకేగా ఉన్నప్పటికీ.. డెబ్యూ మూవీతో కమర్షియల్ హిట్ అందుకోలేకపోయారు. నిజానికి బబుల్ గమ్ మూవీ ప్రమోషన్స్ మామూలుగా జరగలేదు. అనేక స్టార్లు హెల్ప్ చేశారు. డైరెక్టర్ రవికాంత్‌కు కూడా మంచి ట్రాక్ రికార్డు ఉంది. కానీ సినిమా మాత్రం ఆకట్టుకోలేకపోయింది. అయితే ఇప్పుడు రోషన్.. మోగ్లీ మూవీపై నమ్మకం పెట్టుకు న్నారు. కలర్ ఫోటో వంటి నేషనల్ అవార్డు విన్నింగ్ పిక్చర్స్ తీసిన సందీప్ రాజ్ దర్శకత్వంలో ఆ సినిమా రూపొందు తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న మోగ్లీ మూవీ షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో సినిమా ఉండగా.. కొన్ని రోజుల క్రితం మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంది. వినూత్నమైన కథాంశంతో సినిమా రానున్నట్లు అందరికీ క్లారిటీ వచ్చింది. దీంతో ఆడియన్స్ దృష్టి మోగ్లీపై పడింది. అయితే డిసెంబర్ 12వ తేదీన సినిమా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. ప్రమోషన్స్ కూడా చేపట్టారు. కానీ ఇప్పుడు సినిమా విడుదల వాయిదా పడినట్లు వార్తలు వస్తున్నాయి. మేకర్స్ మరికొన్ని గంటల్లో అఫీషియల్‌గా అనౌన్స్ చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మోగ్లీ విడుదల అయ్యే అవకాశం ఉందని సమాచారం. అయితే ఇదంతా అఖండ 2 తాండవం వల్లే ఎందుకంటే నందమూరి బాలకృష్ణ లీడ్ రోల్‌లో నటించిన ఆ సినిమా.. రీసెంట్‌గా విడుదల కావాల్సి ఉంది.

కానీ నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఎంటర్టైన్మెంట్స్ ఆర్థిక సమస్యల మధ్య చిక్కుకోవడం వల్ల పోస్ట్ పోన్ అయింది. ఇప్పుడు డిసెంబర్ 12న అఖండ 2 విడుదల అవ్వనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో అదే రోజు మోగ్లీ రిలీజ్ అయితే ఓపెనింగ్స్ కూడా సాలిడ్ గా దక్కవు. ఆ తర్వాత రోజు రిలీజ్ అయినా వసూళ్లు పెద్దగా రావు. అలా అని డిసెంబర్ 25వ తేదీన విడుదల అనుకుంటే.. అప్పటికే ఆ డేట్‌కు అనేక చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. కాబట్టి చేసేదేమి లేక.. మేకర్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరికి మోగ్లీని వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

# కోర్టు క్లియరెన్స్.. డేట్ కూడా ఫిక్స్ అయినట్లే..



నందమూరి బాలకృష్ణ అభిమానులు గత కొన్ని రోజులుగా చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నారు. తమ అభిమాన హీరో సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటే, సరిగ్గా విడుదల సమయంలో కోర్టు కేసులు, వాయిదా వార్తలు వారిని తీవ్ర నిరాశకు గురిచేశాయి. డిసెంబర్ 5న రావాల్సిన సినిమా ఆగిపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆవేదన అంతా ఇంతా కాదు. కానీ ఇప్పుడు ఆ టెన్షన్ మొత్తానికి తెరపడింది. బాలయ్య ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకునే గుడ్ న్యూస్ వచ్చేసింది. ఎరోస్ సంస్థతో ఉన్న ఆర్థిక వివాదాల కారణంగా సినిమా విడుదలపై సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. అయితే నిన్నటి నుంచి జరుగుతున్న చర్చలు సఫలమయ్యాయి. నిర్మాతలు, ఎరోస్ సంస్థ మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలన్నీ క్లియర్ అయ్యాయి. ఈ విషయాన్ని మద్రాస్ హైకోర్టు పరిగణనలోకి తీసుకుని సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దీంతో సినిమాకు ఉన్న అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఇక అసలు విషయానికి వస్తే.. సినిమా కొత్త విడుదల తేదీని లాక్ చేసినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 12న ‘అఖండ 2’ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకు వచ్చే ఆలోచనలో ఉన్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఈరోజు రాత్రి కల్లా వచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ 5 మిస్ అయినా, వారం తిరిగేలోపే 12న వస్తుండటంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఏంటంటే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ ఎత్తున పెయిడ్ ప్రీమియర్స్ వేయడానికి ప్లాన్ చేస్తున్నారు. దీనికోసం రెండు రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకుని, డిసెంబర్ 11 రాత్రి నుంచే షోలు మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నారు. అంటే రిలీజ్ డేట్ కంటే ముందే బాలయ్య జాతర మొదలవ్వబోతోందన్నమాట. అయితే సడన్‌గా డేట్ ఫిక్స్ అవ్వడం వల్ల ఓవర్సీస్ మార్కెట్‌లో అనుకున్నంత భారీ రిలీజ్ దొరక్కపోవచ్చు. అక్కడ థియేటర్ల అడ్జస్ట్మెంట్ కష్టమవ్వచ్చు.

కానీ ఒక్కసారి సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే మాత్రం లెక్కలన్నీ మారిపోతాయి. మార్కెట్‌లో మాత్రం బాలయ్య బోయపాటి కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ వల్ల ఓపెనింగ్స్ అదిరిపోవడం ఖాయం. ఆ మాస్ హిస్టీరియా ముందు ఏదీ నిలబడదు. తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, బోయపాటి టేకింగ్, బాలయ్య యాక్షన్.. ఈ మూడు గనక మొదటి పార్ట్ లాగే కుదిరితే బాక్సాఫీస్ దగ్గర రాంపేజ్ మామూలుగా ఉండదు. ఇప్పుడు కావాల్సిందల్లా ఒక్కటే.. పాజిటివ్ టాక్. అది గనక వస్తే ఆకాశమే హద్దుగా వసూళ్లు ఉంటాయి. మరి సినిమాకు టాక్ ఎలా ఉంటుందో చూడాలి.

# రూటు మార్చిన మిల్కీ బ్యూటీ



తమన్నా భాటియా. ముందు చిన్న హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మిల్కీ బ్యూటీ చాలా తక్కువ టైమ్‌లోనే స్టార్ హీరోలందరి సరసన జత కట్టి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు. అయితే గత కొన్నాళ్లుగా తమన్నా బాలీవుడ్‌లో బాగా బిజీ అయిపోయిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ బిగ్ బడ్జెట్ సినిమాల్లో ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ అలరిస్తున్నారు తమన్నా. బాలీవుడ్ బయోపిక్‌లో తమన్నా గత కొన్నాళ్లుగా తమన్నాను ఎక్కువగా ఐటెం సాంగ్స్‌లోనే ఆడియన్స్ చూస్తూ వచ్చారు. అలాంటి తమన్నా ఇప్పుడు తన రూట్‌ను మార్చి ఓ బాలీవుడ్ బయోపిక్‌లో కీలక పాత్ర చేస్తున్నారు. లెజండరీ డైరెక్టర్ వి.శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్‌లో ఓ సినిమా తెరకెక్కుతుండగా అందులో శాంతారామ్ రెండో భార్య, ఒకప్పటి నటి అయిన జయశ్రీ గడ్కర్ పాత్రలో తమన్నా కనిపించనున్నారు. రీసెంట్‌గా మేకర్స్ ఆ సినిమా నుంచి తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా, అందులో తమన్నా వింటేజ్ సెటప్‌లో చీర కట్టులో ఎంతో అందంగా మెరిశారు. ఇంకా చెప్పాలంటే తమన్నా ఆ పోస్టర్‌లో ఒక వింటేజ్ నటి యొక్క వైబ్‌ను తీసుకొచ్చారు. కెరీర్లో ఇప్పటివరకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ చేసిన తమన్నా రీసెంట్‌గా ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ వచ్చి, ఇప్పుడు సడెన్‌గా ఓ బయోపిక్‌లో కీలక పాత్రకు ఎంపికవడం విశేషమనే చెప్పాలి.

మరి రెగ్యులర్‌గా తమన్నాను గ్లామరస్ లుక్స్‌లో చూడటం అలవాటు చేసుకున్న ఆడియన్స్‌ను తమన్నా ఈ సినిమాతో ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. అయితే నటిగా తమన్నా ఇప్పటివరకు ఎప్పుడూ ఫెయిలైంది లేదు. తన వద్దకు వచ్చిన పాత్రకు 100% న్యాయం చేసే తమన్నా మరి ఈ బయోపిక్‌తో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. అభిజీత్ శిరీష్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.

# సత్య డిగ్రీ కళాశాల విద్యార్థినికి వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల బిఎ తృతీయ సంవత్సరం విద్యార్థిని కుమారి. ఎస్. పల్లవి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025లో అద్భుత విజయాన్ని సాధించి కళాశాలకు ఎంతో గౌరవం తీసు కొచ్చింది. వెయిట్ లిఫ్టింగ్‌లో 69 కిలోల విభాగంలో పాల్గొన్న పల్లవి, 90 కిలోల స్నాచ్ మరియు 110 కిలోల క్లీన్ & జర్క్ లిఫ్ట్ చేసి అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకంను కైవసం చేసుకుంది. పల్లవి సాధించిన ఈ విజయం ఆమె కఠినమైన సాధన, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనం. ఆమె విజయంతో సత్య డిగ్రీ కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు అయిన డాక్టర్. బొత్స ఝాన్సీ లక్ష్మీ మరియు సత్య విద్యా సంస్థల ట్రేజరర్ డాక్టర్. అనూష, సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవమణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరప నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, కోచ్ చల్లా రాము మరియు అధ్యాపకులు నిర్వహణ వర్గం సంతోషం వ్యక్తం చేస్తూ హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని ఝాన్సీ లక్ష్మీ ఆకాంక్షిస్తూ నగదు బహుమతిని ప్రధానం చేశారు.

# తిరుమల పరకామణి చోరీ చిన్నదా జగన్...?

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఫైర్



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** వైసిపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న తిరుమల పరకామణి చోరీ వ్యవహారం చాలా చిన్న విషయమని తేల్చి చెప్పడం వెనుక పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి అంతరార్థం ఏమిటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రశ్నించారు. ఈ విషయమై నాటి వైసిపీ ప్రభుత్వం పెద్దలు కలుగచేసుకొని ఎక్కడ చెడ్డపేరు వస్తుందో అని ముందుగా ఆలోచించి లోక్ అదాలత్‌లో పిర్యాదుదారుడుకి, చోరీకి పాల్పడిన వ్యక్తికి మధ్య రాజీ కుదిర్చి వ్యవహారాన్ని క్లోజ్ చేశారని అన్నారు. సాక్ష్యాత్ చోరీకి పాల్పడిన తిరుమల ఉద్యోగి రవి కుమార్ అనే వ్యక్తే తప్పు చేశానని అందుకు ప్రాయశ్చిత్తంగా తన ఆస్తిలో 90 శాతం దేవుడికి దక్షిణం రూపంలో అందజేస్తానని చెప్పిన విషయం జగన్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. తప్పు చేశానని ఆయనే ఒప్పుకున్నప్పుడు జగన్ రెడ్డి ఎందుకు కంగారు పడుతున్నారని అన్నారు. ఇంతా జరిగినా సొంత మీడియా ముందుకు వచ్చి గంటలకొలది ప్రెస్ మీట్లు పెట్టి చోరీ చాలా చిన్నదని వితండవాదం చేస్తున్నారని అన్నారు. అంటే ఇదంతా మీకు తెలిసే జరిగిందా..? జగన్ రెడ్డి అని నేను అడుగుతున్నా... వేల కోట్ల రూపాయలు దోచుకొనే వారికి ఇది చిన్న విషయం కావచ్చు కానీ పవిత్ర పుణ్య క్షేత్రంలో ఇలా జరగడం దేనికి సంకేతమని గంటా నూకరాజు ప్రశ్నించారు.

# బిజెపి, కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులకు ఓట్లు వేస్తే మురిగినట్లే

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** గోండ్వాన దండకారణ్య పార్టీ నాయకులు వజ్జా జ్యోతిబసు ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గడప గడప ప్రచారం భద్రాచలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ గోండ్వాన దండాకారణ్య పార్టీ రాష్ట్ర నాయకులు వజ్జా జ్యోతిమాట్లాడుతూ డిసెంబర్ 11న భద్రాచలం పంచాయతీకి జరిగే ఎన్నికల్లో ఓటర్లు బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేస్తే ఆ ఓట్లు మురిగిపోతాయని హైకోర్టు లో కేసు నడుస్తుదికావున సిపిఎం, జిడిపి, ఆదివాసి సంఘాల బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ మరియు 20 మంది వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు.ప్రజా సమస్యల మీద, ప్రజా ఉద్యమాల పట్ల కనీస మైనటువంటి గౌరవం,అవగాహన లేని సర్పంచ్ అభ్యర్థులను ఎన్నుకుంటే మన “కన్నుని మన వేలుతో పొడుచుకున్న”చందంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ‘కప్పదాటు రాజకీయ వ్యవహారాల నడిపే వ్యక్తులు’ కూటమి నాయకత్వాన్ని విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని దుయ్యబట్టారు. భద్రాచలం ప్రజలు శాంతి, గిరిజన,గిరిజన ఐక్యత ఈ ప్రాంత



అభివృద్ధి కోరుకుంటున్నారాన్నారు. మానె రామకృష్ణ లేడీ పర్సు గుర్తు పై అమూల్యమైన ఓటు వేయగలరు.ఈ కార్యక్రమంలో గోండ్వాన దండాకారణ్య పార్టీ నాయకులు, జేఏసీ అభ్యర్థులు మల్లు దొర, చింత అరుణ, మిడియం నాగమణి (9వ), గుండు ప్రదీప్ కుమార్ (10వ), కోర్స చినబాబు (12వ), వుకే పుష్ప లత (15వ), కణితి రాధ (17వ) వార్డు అభ్యర్థులు, మిడియం అఖిల, స్వాతి, బాల కుమార్, అన్ను, వైవీ రావు, రవి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్. వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

**- ప్రజా సమస్యల పరిష్కార వేదిక - (పిజిఆర్ఎస్)కు విశేష స్పందన**
**- పిర్యాదుదారుల నుండి 273 వినతుల స్వీకరణ - పి.జి.ఆర్.ఎస్. వినతులను త్వరితగతిన పరిష్కరించాలి -ఆర్జిదారుల సమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులను ఆదేశాలు : జిల్లా కలక్టరు ఎస్.రాంసుందర్ రెడ్డి**






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులకు జిల్లా కలక్టరు ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు విశేష స్పందన లభించింది. జిల్లా కలక్టరు, జాయింటు కలక్టరు, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు తదితరులు ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను సాదవధానంగా విన్నారు. ఫిర్యాదుదారుల నుండి 273 వినతులు స్వీకరించి, వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టుటకు సంబంధింత జిల్లా అధికారులను జిల్లా కలక్టరు ఆదేశాలు జారీచేసారు. రెవెన్యు శాఖకు సంబంధించి 120 వినతులు, డిఆర్డిఎ సంబంధించి 45 వినతులు, గ్రామ సచివాలయం శాఖకు సంబందించి 7 వినతులు, మున్సిపల్ శాఖ-10, విద్యా శాఖ - 4, జిల్లా పంచాయితీ శాఖ-13, విద్యుత్ శాఖ-10, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ-15, డి.సి.హెచ్.ఎస్.-2, హౌసింగు-4, ఇతర శాఖ నుండి 43 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్‌లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్‌కు అందిన కాల్స్‌కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. ఆర్జిదారుల సమస్యల పరిష్కా



రంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానిని తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింటు కలక్టరు సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు మురళి, డి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీలగాంధీ, బి.శాంతి, కళావతి, సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలాజీ, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు, వ్యవసాయ శాఖ జెడి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అన్నపూర్ణమ్మ, బి.సి.సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, ఆర్.డబ్ల్యుఎస్ మరియు ఆర్ అండ్ బి ఎస్.ఇ.లు మార్కఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, విజయనగరం, ఐ.సిడి.ఎస్. పి.డి. విమలరాణి, డిఆర్ డి ఎ పిడి శ్రీనివాస్ పాణి, మైక్రోఇరిగేషన్ పి.డి. లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితునికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించిన వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు




**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుత్తం, (రాజధాని వార్తలు):** ఉప్పలగుప్తం సన్నవిల్లికి చెందిన దోనిపాటి చిన నాగేశ్వరరావు కుమారుడు సత్యనారాయణ కిడ్నీ పాడై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కిడ్నీ బాధితుడు సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సోమవారం సత్యనారాయణకు వైద్యం నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయం అందించిన రమణారావుకు సత్యనారాయణ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు గుంట్రు చిట్టిబాబు, కాశి శ్రీరామ్, గొల్లపల్లి వెంకటేశ్వర రావు, పెయ్యల పల్లయ్య, గొల్లపల్లి ఏడుకొండలు, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పందిరి సుబ్బరాజు, నేలపూడి సుగంధ కుమార్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు, పరమట రాజేష్, పోలినాటి భీమేష్, పరమట మురళి, బుడితి మణికంత, విప్పర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పురిటిపెంటలో “కోటి సంతకాల” సేకరణ కార్యక్రమం

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పురిటిపెంట గ్రామంలో గల ఎస్సీ కాలనీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మాజీ పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు, వైకాపా మండల నాయకులు కరణం ఆదినారాయణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సంతకాల సేకరణ సందర్భంగా కరణం మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షే అవుతుందని అన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించి పేద ప్రజలకు వైద్యం చేయాలనే కల కల్లగానే మిగిలిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన తక్షణమే విరమించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకట్రావు, పురిటిపెంట మాజీ ఎంపీటీసీ గొర్రె సత్యం అప్పలనాయుడు, పార్టీ నాయకులు పైడపు నాయుడు, నర్సింగరావు, నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# వెలుగు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**మక్కువ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వెలుగులో పనిచేస్తున్న వివో ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని, వెలుగు ఉద్యోగుల సంఘం మరియు సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలంలో వెలుగు ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె గంగు నాయుడు, వెలుగు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు దేవి మాట్లాడారు. ప్రభుత్వం 5జి సిమ్ములు మరియు ఫోన్లు ఇవ్వకుండా ఆన్లైన్ వర్కులు చేయమనడం వెలుగు ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తుందని తెలిపారు. వెలుగులో నేటి వరకు యూనిఫారం గానీ, ఐడి కార్డులు గానీ ఇవ్వలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. వెలుగు ఉద్యోగులకు ఇస్తున్న జీతాన్ని నేరుగా ఉద్యోగుల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, అర్హులైన వివోఏలను సీసీలుగా ప్రమోషన్ అవకాశం కల్పించాలని, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి జీతం ఇవ్వాలని ఈ సమస్యలపై అనేక దఫాలుగా ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయడంలో ముందుకు రావడంలేదని, ఇప్పటికైనా వెంటనే వెలుగు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని తెలిపారు. అలాగే ఈనెల 31 జనవరి 1, 2, 3, 4లో విశాఖలో జరిగే అఖిలభారత సిఐటియు మహాసభలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

# విజయవంతమైన "హిందూ సమ్మేళనం"





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం ఉప మండలం హిందూ సమ్మేళనం నిర్వాహక సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో జరిగిన హిందూ సమ్మేళనం విజయవంతం అయింది. గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి, గంట్యాడ మండలాల నుంచి భారీ సంఖ్యలో హిందూ సోదరులు, సోదరీమణులు హాజరయ్యారు. కోలాటం, పలు హిందూ సాంప్రదాయ నాటికలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అలాగే కొల్లా శిరీష ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పఠనము వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ప్రధానవక్త ఆర్.ఎస్.ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ పంచ పరివర్తనలను గురించి వివరించారు. ఉడిపి నుంచి కమలాత్మనంద స్వామి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహక సమితి అధ్యక్షులు సీరం రెడ్డి చంద్రశేఖర్, బెల్లాన లక్ష్మీ నరేంద్ర, ఉపాధ్యక్షులు ఆరిశెట్టి రాజా, పూసర్ల మోహన్, కార్యదర్శి రెడ్డి చంద్రశేఖర్, రెడ్డి పావని పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ

**- నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాలు - ఈనెల 10వ తేదీన భారీ కార్యక్రమం : మాజీ ఎమ్మెల్యే "బొత్స అప్పలనరసయ్య"**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న తలంపు తప్పని, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ పార్టీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి నియోజకవర్గంలో అనూహ్య స్పందన లభించిందని నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైకాపా సీనియర్ నాయకులు బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో 60 వేల సంతకాలతో కూడిన దస్త్రాలను పదో తేదీన నియోజవర్గ కేంద్రమైన గజపతినగరంలో భారీ కార్యక్రమం చేపట్టి అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు వద్ద ఆ దస్త్రాలను ఉంచనున్నట్లు తెలిపారు. అనంతరం ఆ ప్రతులను భారీ ర్యాలీ నడుమ విజయనగరం జిల్లా పార్టీ ఆఫీస్‌కి అందజేయనున్నట్లు చెప్పారు. పదో తేదీన చేపట్టనున్న కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. 13వ తేదీన జిల్లాపార్టీ ఆఫీస్ నుంచి భారీ ఊరేగింపు నడుమ విజయవాడ పార్టీ కార్యాలయానికి పంపమన్నామని, అలాగే 17వ తేదీన తమ అధినేత జగన్మోహన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి కోటి సంతకాలతో కూడిన దస్త్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందడానికి ఈ సంతకాల సేకరణ నిదర్శనం అన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి సంతకాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. కూటమి ప్రభుత్వము అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలను మోసకారి మాటలతో నట్టేట ముంచిందని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య విమర్శించారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా అమలు చేశామంటూ నాటకాలు ఆడుతుంది అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ బదులన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే బాగుపడ్డాయని ఇప్పుడు ఆ బదుల్లో చంద్రబాబు ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించుకుంటుందన్నారు. విద్యారంగంలో సమూలమైన సంస్కరణలు తమ ప్రభుత్వం తీసుకు వచ్చిందని బొత్స అన్నారు. రాజకీయ లబ్ధి కోసం దేవుణ్ణి కూడా వాడుకున్న దుర్బుద్ధి చంద్రబాబుదే అన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అన్న చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ స్థాయిలో స్టీల్ ప్లాంట్ పట్ల ద్వంద వైఖరితో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, వైకాపా నాయకులు కే.పైడపు నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దుగ్గేరుపంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ జీవో 84 రద్దు చేయాలి





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల ఎర్ర సామంత వలస గ్రామంలో ఆదివారం నాడు దుగ్గేరు పంపుడు స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ రాయల సుందర్ రావు మాట్లాడుతూ గిరిజన రైతులకు తీవ్ర నష్టం చేకూర్చే విధంగా తలపెట్టిన 2000 మెగావాట్ల పంపుడు హైడ్రో పవర్ స్టోరేజ్ జీవో 84 వెంటనే రద్దు చేయాలి అంటూ డిమాండ్ చేశారు. లేకుంటే తరతరాలుగా కొండ కోనల్లో బతుకు ఏడుస్తుంది గిరిజన రైతులు నష్టానికి గురువుతారని పనసభద్ర కొదమ పంచాయతీలో ఉండే గిరిజన గ్రామాలు పూర్తిగా ఖాళీ చేయాల్సి వస్తుందని ఈ ప్రాజెక్టు ప్రభావంతో దాదాపు 1500 ఎకరాలు గిరిజన గిరిజనేతరులు కోల్పోయి రోడ్డును పడతారని తెలియజేశారు. పై విషయమై గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకుని వెళ్ళగా ప్రజాభిప్రాయం మేరకే జరుగుతుంది అంటూ రెండు నాలుకల ధోరణిలో సమాధానం చెప్పారు గిరిజనులకు అన్యాయం జరిగితే హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక కమిటీ భూమి కోల్పోయే గిరిజనులందరిని ఏకతాటిపైకి తీసుకొని వచ్చి పోరాటం చేస్తాం అని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు కూలీల సంఘ కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ 100% గిరిజనులు ఉన్న గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని ఇప్పుడు మరల హైట్రో పవర్ ప్రాజెక్ట్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల భూములను కోల్పోయేటట్టుగా చేస్తుందని దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వంపై గిరిజన ప్రజలను పోరాటాలకు సిద్ధం చేస్తామని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా దుగ్గేరు పంపుడు స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కన్వీనర్లు ఉయ్యకముత్యాలు మరియు చెంచు పీడీక అసిరి మరియు కమిటీ సభ్యులు ఎర్ర సామంత వలస గ్రామ పెద్దలు రాయల అప్పారావు శ్రీధరపు సూరయ్య వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన గిరిజన ముఖ్యులు రైతులు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక నిధికి విరాళం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల ఏడవ తేదీన జాతీయ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న సైనికులకు, మాజీ సైనికులకు, వారి వారి కుటుంబ సభ్యులకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యుద్ధాల్లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. దేశ భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న సైనికుల సంక్షేమార్థం అందరూ వారి సామర్థ్యానికి తగ్గట్టు విరాళాలు అందించి, పతాక నిధికి సహకరించాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాద్ రావు మరియు సిబ్బంది, ఎన్‌సిసి అధికారులు, సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

**- అధిక శాతం అధికారులు ఆబ్సెంట్**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల బడ్జెట్ సమావేశంలో 2025 – 26 సవరణ బడ్జెట్, 2026 – 27 అంచనా బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం లభించింది. కార్యాలయ సూపరింటెండెంట్ పుష్పలత బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, సభ్యులందరూ తమ ఏకగ్రీవ ఆమోదాన్ని తెలిపారు. బడ్జెట్ సమగ్ర స్వరూపం ఇలా ఉంది. 2025–26 సవరణ బడ్జెట్లో ప్రారంభం నిల్వ 2,10,78,621 రూపాయలుగా, ఆదాయము 91,90,52,000 రూపాయలుగా, వ్యయం 91,64,06,000 రూపాయలు కాగా, అంత్యనిల్వ 2,37,24,621 రూపాయలుగా చూపించారు. అలాగే 2026 – 27 అంచనా బడ్జెట్లో ప్రారంభ నిల్వ 2,37,24,621 కాగా, ఆదాయము 83,32,71,743 రూపాయలు, వ్యయము 83,34,33,843 రూపాయలుగా, అంత్య నిలువ 2,35,62,521 రూపాయలుగా చూపించారు. అయితే, ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు ఎక్కువ సంఖ్యలో డుమ్మా కొట్టారు. సభ్యులు కూడా కోరం నకు సరిపోయినంత మాత్రమే హాజరయ్యారు. దీనితో సమావేశంలో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఈ సమావేశంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జడ్పిటిసి గార తౌడు, వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి, ఎంపీడీవో బి.కళ్యాణి, ఎం.ఈ.ఓ. ఎస్.విమలమ్మ పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యం : మంత్రి స్వామి కితాబు





**ఒంగోలు, (రాజధాని వార్తలు):** సమిష్టిగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. బంగారు పథకాన్ని సాధించడం ద్వారా ఎర్రగొండపాలెం యాస్పిరేషనల్ బ్లాక్ సాధించిన విజయమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రభుత్వ సిబ్బందికి అభినందన కార్యక్రమాన్ని జిల్లా ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎర్రగొండపాలెం మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు జిల్లా మొత్తానికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. వీరి అనుభవాలతో జిల్లా మొత్తాన్నీ ఇదేవిధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పురోగతిని ఉన్నత స్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఈ విజయం లభించిందన్నారు. ఇలాంటి అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల పథకాలను సమ్మిళితం చేస్తూ ప్రతి రెవిన్యూ డివిజన్లోనూ ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నామని అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల. జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఉత్తమ పనితీరుకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుంది అని చెప్పారు. అందుకే మండల స్థాయిలో కాకుండా జిల్లా స్థాయిలో ఈ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామన్నారు. విజేతలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. వై.పాలెం టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలను కల్పించడంతో పాటు మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది కూడా పనిచేయటం ద్వారా ఎర్రగొండపాలెం మండలానికి ఈ గుర్తింపు లభించింది అన్నారు. ఆయా విభాగాలలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా పర్యవేక్షించిన జిల్లాస్థాయి అధికారులను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే ఈ సందర్భంగా సత్కరించారు. ముందుగా ఆయా శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, 'సంపూర్ణత అభియాన్' కార్యక్రమాన్ని తెలియజేసేలా ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింటు వద్ద ఫోటోలు దిగారు. రాష్ట్రంలో 15 మండలాలను (బ్లాక్స్) కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాటిలో ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం మండలం కూడా ఉన్నది. ఈ మండలంలో 2023 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ (ఏ.బీ.పీ) ప్రారంభమైంది. ఈ బ్లాక్‌లోని ప్రజల ఆరోగ్య స్థితిగతులు, ముఖ్యంగా చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, భూసార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయడం, స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు లభిస్తున్న రివాల్వింగ్ ఫండ్ వంటి ఇండికేటర్స్ ను ప్రామాణికంగా నిర్ధారించింది. ఈ విభాగాలలో అద్భుతమైన పురోగతి సాధించడం ద్వారా రాష్ట్రంలోనూ, కేంద్ర స్థాయిలోనూ ఎర్రగొండపాలెం బ్లాక్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం బంగారు పథకాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సిపిఓ సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ, ఎర్రగొండపాలెం ఎంపీడీవో (యాస్పిరేషనల్ బ్లాక్ నోడల్ ఆఫీసర్) శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మండల స్థాయి సిబ్బంది అందరూ అతిథులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అడ్డుకుంటున్న భూకబ్జా దారునిపై చర్యలు తీసుకోవాలి - డక్కిలి తాసిల్దార్‌కు సిపిఐ వినతి




**దక్కిలి, (రాజధాని వార్తలు):** డక్కిలి మండలం చెన్నసముద్రంకు చెందిన తిరుపాలకు చెందిన అసైన్మెంట్ భూముల్లోకి వ్యవసాయం చేసుకోనీకుండా దౌర్జన్యంగా అడ్డుపడుతున్న భూ కబ్జాదారుడు శేఖర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం డక్కిలి తాసిల్దార్ మోపూరు శ్రీనివాసులు కు సిపిఐ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో వినతి పత్రం అందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన అసైన్మెంట్ భూమిలో సాగు చేసుకుంటున్నా దళిత కులానికి చెందిన తిరుపాల్‌ను గత మూడు సంవత్సరాలుగా భూముల్లోకి రానివ్వకుండా సాగు చేసుకొని ఇవ్వకుండా దౌర్జన్యంగా అడ్డుపడుతున్న భూకబ్జా దారుడు మిట్టపాలెంకు చెందిన మామిళ్ళపల్లి శేఖర్ నాయుడు ఆగడాలు మితిమీరుతున్న పోలీసులు రెవెన్యూ వారు చూసి చూడ నట్టు వ్యవహరించడం సరైనటువంటిది కాదని వారు సూచించారు ప్రభుత్వం ఇచ్చిన సర్వే నంబర్ 57/2 , 64/7, మరియు 36/1 లో ఎ 1.75 సెంట్లు భూమి వెంకటగిరి రాపూర్ ప్రధాన రహదారి కానుకొని ఉండడంతో శేఖర్ నాయుడు ఆ భూమిపై కన్నేసి ఎలాగైనా అమాయకుడైన తిరుపాలను బెదిరించి కబ్జా చేయాలని దురుద్దేశంతోనే అతని భూములకు రానీకుండా అడ్డు కుంటున్నాడని వారు తీవ్రంగా ఆరోపించారు. మండల తాసిల్దార్ మోపూరు శ్రీనివాసులు స్పందిస్తూ దళితుడైన తిరుపాలకు చెందిన అసైన్మెంట్ భూమిని ఆన్లైన్ ప్రకారం వెరిఫై చేసి పోలీసు వారి సహకారంతో ఆయన సాగు చేసుకునేటట్లు సహకరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాళయ్య, సమతా సైనిక దళ్ నియోజకవర్గ అధ్యక్షులు చిట్టేటి రాజా మండల అధ్యక్షులు మోరా సుబ్బారావు, ఎన్ శ్రీనివాసులు, ఎన్ రమణయ్య, డక్కిలి తిరుపాలు, వరలక్ష్మి, టి శ్రీనివాసులు, బి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమం

## - ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించండి : కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఈ నెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో 5 సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్ పోలియో పై అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ 100 శాతం పోలియో చుక్కలు వేయించాలని భావితరాన్ని పోలియో బారిన పడకుండా చూడాలన్నారు. జిల్లాలో 2,09,652 మంది ఐదు సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలు ఉన్నారని వారిలో అర్బన్‌లో 1,93,090 మంది గ్రామీణ ప్రాంతాల్లో 16,562 మంది ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేయడం కోసం 1062 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 50 ట్రాన్సిట్ బూత్‌లను, 85 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలి పోయిన వారందరికీ 22, 23వ తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని, దీనికోసం 2004 టీం లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 85 హైరిస్క్ ప్రాంతాలలో 6,497 మంది చిన్నారులు ఉన్నారని అలాంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోలియో చుక్కలు వేయాలన్నారు. సంబంధిత జిల్లా అధికారులు ఎంపీడీవోలు, సిడిపివోలు అంగన్వాడీలు స్వయం సంఘాలు, సిబ్బంది పల్స్ పోలియో విజయవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. పల్స్ పోలియోపై సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లో సీసీటీవీల ద్వారా ప్రచారం చేయాలని జీవీఎంసీ అధికారులను, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఎ పి ఇ పి డి సి ఎల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇంచార్జ్ డిఆర్ఓ సత్తిబాబు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ,డి ఎం హెచ్ ఓ డా.జగదీశ్వరరావు,డి సి హెచ్ యస్ డా.శంకర ప్రసాద్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.అప్పారావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రుణాలు రద్దు చేయాలని ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** టిట్కో గృహాల బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఐద్వా అధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీ రమణి, జిల్లా అధ్యక్షులు భూలక్ష్మీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు టిట్కో రుణాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని మరిచారన్నారు. లబ్ధిదారుల వాటా రూ. లక్ష కట్టించుకొని 10 సంవత్సరాల తర్వాత ఇంటిని అందజేశారన్నారు. రూ. 3 లక్షల బ్యాంకు రుణం ఇచ్చి 20 సంవత్సరాల పాటు లోను చెల్లించాలంటూ బ్యాంకు, మెప్మా సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణం బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, లేకుంటే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఫ్లాట్లను రద్దు చేయాలని




డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిట్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాధితునికి రూ.10 వేలు సాయం అందించిన రమణారావు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న బాధితునికి గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. ఉప్పలగుప్తం సన్నవిల్లికి చెందిన దోనిపాటి చిన నాగేశ్వరరావు కుమారుడు సత్యనారాయణ కిడ్నీ పాడై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.కిడ్నీ బాధితుడు సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సోమవారం సత్యనారాయణకు వైద్యం నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయం అందించిన రమణారావుకు సత్యనారాయణ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సభ్యులు గుంట్రు చిట్టిబాబు, కాశి శ్రీరామ్, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, పెయ్యల పల్లయ్య, గొల్లపల్లి ఏడుకొండలు, నేరేడుమిల్లి శ్రీనివాసరావు,




పందిరి సుబ్బరాజు, నేలపూడి సుగంధ కుమార్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు, పరమట రాజేష్, పోలినాటి భీమేష్, పరమట మురళి, బుడితి మణికంత, విప్పర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan